క్లుప్తంగా

ముంపు బాధితులకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు: ఇటీవలి భారీ వర్షాలకు ముంపు బారిన పడిన పట్టణ శివారు నందమూరు రోడ్డులోని లేఅవుట్–3లోని 38 కుటుంబాల వారికి శనివారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, కందిపప్పు, బంగాళాదుంపలు, కిలో వంట నూనె చొప్పున అందజేశారు. కార్యక్రమంలో కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు పాల్గొన్నారు.

వరద బాధితులకు బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

నిడదవోలు: ఏలూరు సోషల్ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం సుమారు వెయ్యి మంది ఎర్ర కాలువ వరద బాధితులకు ఐదేసి కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. పట్టణంలోని సుబ్బరాజుపేట, ఎంవీ నగర్, తీరుగూడెం ప్రాంతాలతో పాటు మండలంలోని తాళ్లపాలెం, తిమ్మరాజుపాలెం, సింగవరం, కంసాలిపాలెం గ్రామాల్లోని వరద బాధితులకు ఈ బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సోషల్ సెంటర్ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ టి.ఇమ్మానుయేల్, రెవరెండ్ ఫాదర్ డాక్టర్ జయరావు పొలిమేర, ఫాదర్ డి.విజయ్‌కుమార్, క్రీస్తు రాజు, రెవరెండ్ ఫాదర్ కృపానందం, టి.బాలస్వామి, టి. రవి, సర్పంచ్ యర్రా రామకృష్ణ, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు వెలగన సూర్యారావు, బాబి తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీ దేవిగా కనకదుర్గమ్మ



ఉండ్రాజవరం: ఆషాఢ మాసం సందర్భంగా ఉండ్రాజవరం గ్రామంలోని వెలగదుర్రు రోడ్డులో కొలువైన కనకదుర్గమ్మ వారు భక్తులకు శనివారం శాకంబరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. అర్చకుడు దోనేపూడి సుధాకర్ ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచి అమ్మవారికి మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే ఉండ్రాజవరంలోని బాలా త్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామి ఆలయంలో లలితా పరమేశ్వరి అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. అనంతరం మహిళా భక్తులు లలితా పారాయణ చేశారు.

కాటకోటేశ్వరంలో ఉమాపార్వతి వారికి..



నిడదవోలు రూరల్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని కాటకోటేశ్వరం గ్రామంలోని ఉమా కాటకోటేశ్వర లింగేశ్వరస్వామి ఆలయంలోని ఉమా పార్వతి అమ్మవారిని శనివారం శాకంబరిగా అలంకరించారు. అమ్మవారికి అలంకరించిన కూరగాయలను కాటకోటేశ్వరం కూరగాయల వర్తక సంఘ సభ్యులు సమకూర్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఏటిగట్టు.. తీసికట్టు

- అండలుగా జారిపోతున్న గోదావరి గట్టు
- కాకరపర్రు – ముక్కామల మధ్య పలుచోట్ల బలహీనం
- గట్టుపై చెరువును తలపించేలా నీరు

భీతిల్లుతున్న తీర గ్రామాల ప్రజలు



కాకరపర్రు వద్ద ఏటిగట్టుకు పడిన గాడి

పెరవలి: ప్రస్తుతం గోదావరి నదికి వచ్చిన వరదలకు మండలంలోని కాకరపర్రు నుంచి ఖండవల్లి వరకూ ఏటిగట్టుకు పలుచోట్ల అండలు జారిపోయాయి. గోదావరి నది వైపు పెద్దగా ఏర్పడిన ఈ గాడులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. దాంతో మళ్లీ వరద పెరిగితే ముప్పు తప్పదని తీర గ్రామాల ప్రజలు భీతిల్లుతున్నారు. వరదనీరు ఏటిగట్టును తాకడంతో గట్టు పగులు ఇచ్చి క్రమంగా పెద్దపెద్ద అండలు జారిపోయాయని రైతులు వివరిస్తున్నారు. 1986లో వరదలు సంభవించినపుడు ఖండవల్లి, మల్లేశ్వరం గ్రామాల మధ్య ఐదు చోట్ల ఇలాగే గండ్లు పడ్డాయని చెబుతున్నారు. ముక్కామల, కానూరు అగ్రహారం, కాకరపర్రు వద్ద ప్రసుత్తం ఏటిగట్టు ప్రమాదకరంగా ఉంది. ఒకవైపు గోదావరి నదిలో నీటిమట్టం పెరుగుతుండగా, మరోపక్క ఏటిగట్టు అండలు అండలుగా విరిగిపడడంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని ఈ ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు పెద్ద మడుగును తలపించేలా ఏటిగట్టు పాడవున్నా పలుచోట్ల నీరు నిలిచిపోయి ఉంది. రోజుల తరబడి గట్టుపై నీరు నిలిచిపోతే ప్రస్తుత వరదల, వర్షాల సీజన్‌లో గట్టు బలహీన పడడానికి కారణమవుతుందని లంక గ్రామాల రైతులు అనుభవంతో చెబుతున్నారు. అధికారులు కాసులకు కక్కుర్తి పడడం వల్లే కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన ఏటిగట్టు ఇలా కొద్దిపాటి వరదకే అండలుగా జారిపోతోందని లంక గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలో 13 కిలోమీటర్ల పొడవునా గోదావరి ఏటిగట్టు రక్షణగా ఉంది. కాకరపర్రు, ముక్కామల, తీపర్రు ఉమ్మిడివారిపాలెం, ఖండవల్లి వద్ద ఈ గట్టు అండలుగా జారిపోతోంది.



తీపర్రు వద్ద కాలువను తలపిస్తున్న గోదావరి ఏటిగట్టు



కానూరు వద్ద ఏర్పడిన గాడి

కొన్నింటిని పూడ్చాం

గోదావరి ఏటిగట్టుకు పడిన గాడుల గురించి గోదావరి ఫ్లడ్ కన్జర్వెన్సీ జేఈ జి.పవన్‌కుమార్ (సిద్ధాంతం)ను 'సాక్షి' వివరణ కోరింది. ఇటీవలే ఏటిగట్టుకు పందలపర్రు, పెండ్యాల, కానూరు అగ్రహారం, కాకరపర్రులలో పడిన గాడులను ఇసుక బస్తాలతో పూడ్చించామని ఆయన బదులిచ్చారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల పెరవలి మండలంలోని కాకరపర్రు– ఖండవల్లి మధ్య ఏటిగట్టుకు గాడులు పడి ఉండవచ్చన్నారు. వాటిని పరిశీలించి, త్వరలోనే పూడ్చేస్తామని పవన్‌కుమార్ సమాధానం చెప్పారు. ఆందోళన పడాల్సిన పనిలేదన్నారు.

ఇప్పటికీ ముంపులోనే..

- గోదావరికి పెరగనున్న వరద
- నేడు లంక పంటలు భూములు మరింతగా మునిగే ముప్పు



కాకరపర్రులో కుళ్లిపోయిన కూరగాయల పంటలు



ఖండవల్లిలో నీట మునిగిన బొప్పాయి తోట

పెరవలి: గోదావరికి వరద వచ్చి వారం అవుతున్నా ఇప్పటికీ ఎక్కడ నీరు అక్కడే నిలిచి ఉంది. ఇంతలోనే ధవళేశ్వరం వద్ద మరోసారి రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యింది. దాంతో ఆదివారం నాటికి గోదావరి వరద మరింత పెరుగుతుందని అధికారులు స్పష్టం చేయడంతో తీర గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. ఇప్పటికే పంటలు నీటమునిగి ఉండడం, మన ప్రాంతంలో గోదావరి తగ్గినప్పటికీ ఎగువన భద్రాచలంలో నీటిమట్టం పెరగడంతో లంక గ్రామాల రైతులు తలలు పట్టుకుంటున్నారు. గిట్టుబాటు ధర లభిస్తున్న సమయంలో వచ్చిన వరదలు తమను అప్పుల పాలయ్యేలా చేసిందని గగ్గోలు పెడుతున్నారు. ధవళేశ్వరం వద్ద నుంచి 12.50 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదలడంతో పంటలు నీటిలోనే మునిగివున్నాయి. కూరగాయల పంటలు మొత్తం కుళ్లిపోయాయి. కంద, పసుపు పనికిరావని, పూలతోటలు, ఆకుకూరలు, పచ్చిమిరప తోటలదీ అదే పరిస్థితి అని చెబుతున్నారు. నీరు తీసేసినా దొండ, బీర, ఆనప, పొట్ల పందిర్లు దెబ్బతింటాయంటున్నారు.

పాఠశాలల్లో పచ్చదనం పెంచండి

- డీఈవో వాసుదేవరావు
- అన్నదేవరపేట జెడ్పీ హైస్కూల్లో తనిఖీలు



అన్నదేవరపేట జెడ్పీ హైస్కూల్లో నిర్వహించి వన మహోత్సవంలో డీఈవో వాసుదేవరావు, అధికారులు, విద్యార్థినులు



దేవరపల్లి జెడ్పీ హైస్కూల్లో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తాళ్లపూడి: పాఠశాలల్లో మొక్కల పెంచాలని, సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు సూచించారు. మండలంలోని అన్నదేవరపేట జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు తగ్గడాన్ని గుర్తించిన ఆయన కారణాలపై ఆరా తీశారు. ఎకో క్లబ్ ఏర్పాటు చేసి, సభ్యుల జాబితాను గూగుల్ స్ప్రెడ్ షీట్‌లో పంపాలని ప్రధానోపాధ్యాయిని డి.పద్మ సుజాతను ఆదేశించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లిన డీఈఓ వాసుదేవరావు విద్యార్థులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఈ పాఠశాల్లో నిర్వహిస్తున్న ఎకో క్లబ్ లక్ష్యాల గురించి ఆయన విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి వివరాలు రాబట్టారు. మొక్కల పెంపకం ప్రాధాన్యత గురించి, సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ రికార్డులను అప్డేట్‌గా ఉంచాలని, సోమవారం నుంచి జిల్లా కలెక్టర్ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహిస్తారని చెప్పారు. ఇదే ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఇంటర్ తరగతులను కూడా డీఈఓ పరిశీలించారు. అనంతరం డీఈఓ వాసుదేవరావు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్షా ఏఎంవో డి.గౌరీశంకర్, ఎంఈవోలు సీహెచ్ బాలామణి, సీహెచ్ నెహ్రూజీలు, హెచ్ఎం.డి.పద్మసుజాత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వన మహోత్సవం

దేవరపల్లి: శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వన మహోత్సవం నిర్వహించారు. ప్రతి పాఠశాల్లోనూ విద్యార్థులు, వారి తల్లులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఎంఈఓలు ఎం.తిరుమల దాస్, కేఆర్ఎస్‌వీవీ అప్పారావు పలు పాఠశాలల ఆవరణల్లో మొక్కలు నాటడమే గాకుండా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంఈఓ తిరుమలదాస్ మాట్లాడుతూ శిక్ష సప్తాహ్ కార్యక్రమం ఆరో రోజున పాఠశాలల్లో మొక్కలు నాటడమే గాకుండా కిచెన్ గార్డెన్స్ అభివృద్ధి చేయించామన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు ఎకో క్లబ్స్ ఏర్పాటు వంటి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వారోత్సవాల ముగింపు సదర్భంగా సోమవారం మండలంలోని 45 ప్రభుత్వ పాఠశాలల్లో దాతల సహకారంతో శుభదిన్ భోజన ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. జాతీయ విద్యా విధానం అమల్లోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ శిక్ష సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

ఉండ్రాజవరం: శిక్షా సప్తాహ్ ఆరో రోజు కార్యక్రమంలో భాగంగా పైడిపర్రు, తేతలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని మోర్త, తాడిపర్రు ప్రాథమిక పాఠశాల నంబర్–2 ఆవరణలలో శనివారం మొక్కలు నాటారు. లయన్ కుంకట్ల వెంకటరత్నం ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఉందుర్తి ప్రసన్నకుమార్, క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పీడీజీ బాబూజీ, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ గోవింద్ మొక్కలు నాటారు. అలాగే విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్ఎల్‌వీ ప్రసాదరావు, పీసీ చైర్మన్ పోలిశెట్టి దుర్గాభవాని, లయన్ సిర్రా కార్తీక్, మందపల్లి రాకేష్, ఉపాధ్యాయురాలు కె.బేబీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరుపాడు జెడ్పీ హైస్కూల్లో..

గోపాలపురం: మండలంలోని కొవ్వూరుపాడు జిల్లా జెడ్పీ హైస్కూల్లో శనివారం శిక్షా సప్తాహ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం డి. శేషారత్నం, ఎ. మహేశ్వరరావు, సీఆర్పీలు కె.నాగరాజు,లక్ష్మణ్, సుబ్రహ్మణ్యం, ఉపాద్యాయులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

జిల్లా పంచాయతీ అధికారి దాసరి రాంబాబు



చాగల్లులో పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో రాంబాబు

చాగల్లు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) దాసరి రాంబాబు అన్నారు. చాగల్లు గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించి పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వీధుల్లో చెత్త కుప్పలు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోజూ క్లోరినేషన్ చేసిన తాగు నీటిని మాత్రమే గ్రామ ప్రజలకు అందించాలని సూచించారు. చాగల్లు సెంటర్లోని ఓహెచ్ఎస్ఆర్ వద్ద పంచాయతీ ఫిట్టర్ సుబ్రహ్మణ్యం కొత్తగా ఏర్పాటు చేసిన లిక్విడ్ క్లోరినేషన్ మెషీన్‌ను డీపీవో రాంబాబు చూసి ఆయనను అభినందించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి మహ్మద్ అలీ, పంచాయతీ కార్యదర్శి ఎల్.రవికుమార్ పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో నేడు మంత్రుల పర్యటన

నిడదవోలు రూరల్: మండలంలోని ఎర్ర కాలువ ముంపు ప్రాంతాల్లో రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు, కందుల దుర్గేష్‌లు ఆదివారం పర్యటించనున్నారు. ఎర్ర కాలువతో నీట మునిగిన పంట పొలాలను సింగవరం, కంసాలిపాలెం గ్రామాల్లో వారు పరిశీలిస్తారు.

నీటిశుద్ధి ప్లాంట్‌కు పచ్చజెండా

- డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలం వాపసు
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఆమోదం



కొవ్వూరు పురపాలక సంఘ సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ బావన రత్నకుమారి

కొవ్వూరు: పట్టణంలో వాటర్ వర్క్స్ స్థలంలో గోదావరి నీటిని శుద్ధిచేసే ప్లాంట్ ఏర్పాటుకు కొవ్వూరు మున్సిపాలిటీ పాలకవర్గం ఆమోదం తెలిపింది. చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన శనివారం మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు వాటర్ వర్క్స్‌లో 4.48 ఎకరాల స్థలాన్ని గతంలో కేటాయించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం డిగ్రీ కళాశాలకు 15 ఎకరాల స్థలం అవసరమని సంబంధిత జీవో 571లో పేర్కొన్నారని సమావేశంలో స్పష్టం చేశారు. రూ.57.56 కోట్లతో నిర్మించే తాగునీటి శుద్ధి ప్రాజెక్టుకు గతంలోనే శంకుస్థాపన చేయడంతో పాటు పరిపాలనా ఆమోదం కూడా లభించినందున స్థలం కేటాయింపునకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పట్టణ శివార్లలోని జగనన్న లేఅవుట్‌లో వాడపల్లి, మద్దూరులంక వాసులకు స్థలాలు కేటాయించినా వారు ఇక్కడకు రాలేదు. ఈ ప్రాంతం ఖాళీగా ఉన్నందున డిగ్రీ కళాశాలకు ఆ స్థలాన్ని ప్రతిపాదించనున్నట్టు టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని ప్రకటించారు. రుడా నుంచి పట్టణ సుందరీకరణకు రూ.3 కోట్ల నిధులను ఎమ్మెల్యే కోరారు. గోష్పాద క్షేత్రంలోని దేవతా వృక్షం నరికివేత విషయంలో కమిషనర్ జోసెఫ్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. తమ పరిధిలో లేని అంశం అయినందునే తాము కలుగ జేసుకోలేదని కమిషనర్ వివరణ ఇచ్చారు. సంబంధిత అధికారులకు ఎందుకు నివేదించ లేదని పలువురు సభ్యులు ప్రశ్నించారు. నాన్ పీహెచ్ వర్కర్స్ అందరికీ జీతాలు పెంచే విషయంపై కౌన్సిల్ దృష్టి సారించాలని చిన్ని కోరారు.

వీధిలైట్లు వెలగడం లేదు : 9,10,14,16 వార్డుల్లో వీధి లైట్లు సక్రమంగా వెలగడం లేదని కౌన్సిలర్‌లు బత్తి నాగరాజు, చీరా అరుణ, మురళీకృష్ణ, కండెల్లి రామారావు సమావేశం దృష్టికి తెచ్చారు. తొమ్మిదో వార్డులో ఆర్‌పీగా పని చేస్తున్న శ్రీలక్ష్మి మహిళా సంఘాల రికార్డులను ట్యాంపరింగ్ చేస్తున్నారని కౌన్సిలర్ మురళీకృష్ణ ఆరోపించారు. విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రథమ అజెండాలో పేర్కొన్న 50 అంశాలను, అనుబంధ అజెండాలో పేర్కొన్న ఆరు అంశాలకు కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. సీనియర్ కౌన్సిలర్ కోడూరి శివరామకృష్ణ, వైస్ చైర్‌పర్సన్‌లు మన్నె పద్మ, గండ్రోతు అంజనీదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకే మిషన్ శక్తి

నల్లజర్ల: మహిళా సాధికారత కోసమే కేంద్ర ప్రభుత్వం మిషన్ శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిందని ఐసీడీఎస్ గోపాలపురం సీడీపీఓ బాలాత్రిపుర సుందరి అన్నారు. ఆమెన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం దూబచర్లలో భేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ పోక్సో చట్టం, బాలల హక్కులు, బాధ్యతల గురించి కిశోర బాలికలకు వివరించారు. మిషన్ శక్తి అనేది మహిళల భద్రతపై దృష్టి సారించే పథకమన్నారు. బాల్య వివాహాల నివారణకు అందరూ కృషి చేయాలన్నారు. గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌లపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

శానిటరీ న్యాప్‌కిన్లు పంపిణీ

ఆమెన్ ట్రస్ట్ అధ్యక్షుడు ఇవాంజలిన్ అశోక్ ఆధ్వర్యంలో బాలికలకు శానిటరీ న్యాప్‌కిన్లు, ఆరోగ్య అవగాహన పత్రాలు అందజేశారు. హైస్కూల్ హెచ్ఎం బి. సుమతి, రాజమహేంద్రవరం వన్ స్టాప్ సెంటర్ ప్రతినిధులు మరియకుమారి, సరస్వతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం. హారతి, వైద్యఉద్యోగుల సంఘం నాయకుడు జీవీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణగూడెంలో అవగాహన ర్యాలీ

చాగల్లు: మండలంలోని మార్కొండపాడు ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని బ్రాహ్మణగూడెం గ్రామంలో శనివారం భేటీ బచావో.. భేటీ పడావో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, బాలికల అక్రమ రవాణా, పౌష్టికాహార లోపం వల్ల బాలికల్లో వచ్చే రక్తహీనత తదితర అంశాల గురించి ఐసీడీఎస్ మార్కొండపాడు సెక్టార్ సూపర్‌వైజర్ జి.శిరీష కిషోర బాలికలకు అవగాహన కల్పించారు.అలాగే మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో కె.లక్ష్మి, అరుణ శ్రీదేవి, ఏఎన్ఎం సుజాత, ఎంఎల్ హెచ్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు తెచ్చి నిడదవోలును అభివృద్ధి చేస్తా

- రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్
- అజెండాలోని 38 అంశాల ఆమోదం
- మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం



కౌన్సిల్ సమావేశంలో మంత్రి దుర్గేష్‌ను గజమాలతో సత్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, కౌన్సిలర్లు

నిడదవోలు: ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో సమర్థంగా అమలు చేయాలని రాష్ట్ర సాంస్కృతి, పర్యాటక, సినిమాటోఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. నిడదవోలు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన శనివారం జరిగింది. ఎక్స్–అఫిషియో సభ్యుడి హోదాలో తొలిసారిగా మంత్రి దుర్గేష్ సమావేశానికి హాజరయ్యారు. అజెండాలోని 9వ అంశాన్ని వాయిదా వేసి మిగిలిన 38 అంశాలను సమావేశం ఆమోదించింది. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ భవిష్యత్తులో నిడదవోలు పట్టణాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మున్సిపల్ శాఖ మంత్రులతో చర్చించి నిధులు సమీకరించి రోడ్లు, డ్రైన్లు, పారిశుద్ధ్యం,తాగునీరు, వీధిలైట్లు వంటి మౌలిక వసతులను మెరుగు పరుస్తానని చెప్పారు.

తాగునీటి సరఫరా మెరుగుపరచండి

పట్టణంలో తొమ్మిది నెలలుగా మంచినీటి సరఫరా సక్రమంగా లేదంటూ కౌన్సిలర్ పువ్వల రతీదేవి అధికారులను నిలదీశారు. మరిన్ని నిధులు మంజూరు చేయించి పట్టణాభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు సమావేశంలో మంత్రి దుర్గేష్‌కు విజ్ఞప్తి చేశారు. కౌన్సిలర్ ఎస్‌కే వజీరుద్దీన్ మాట్లాడుతూ తన వార్డు పరిధిలోని వైఎస్సార్ నగర్, జగనన్న కాలనీల అభివృద్ధిపై మంత్రి దుర్గేష్ దృష్టి సారించాలని కోరారు. కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ తన వార్డులో పెండింగ్‌లో ఉన్న ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ మాట్లాడుతూ పలు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి రుడా నిధులు రూ.3.10 కోట్లు మంజూరు చేయించిన మంత్రి దుర్గేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్‌ను మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ ఆధ్వర్యంలో కౌన్సిల్ సభ్యులు, అధికారులు గజమాల, జ్ఞాపికతో సత్కరించారు.